క్లుప్తంగా

తప్పుచేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: తప్పుచేస్తే ఎవర్నీ ఉపేక్షించేదే లేదని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు. భూమి రికార్డులు మార్చి సమాధి స్థలాన్ని ఆక్రమించారని ఓ దినపత్రికలో(సాక్షి కాదు) మంగళవారం వార్త రావడంతో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి గ్రామంలో నిజంగా ఎవరైనా అక్రమంగా భూమి ఆక్రమణకు పాల్పడితే అటు వంటి వారిపై విచారణ నిర్వహించి వెంటనే చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫోన్ చేసి తెలిపినట్లు చెప్పారు. భూ ఆక్రమణలో నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా, తప్పు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారికి ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ రికార్డులను పక్కాగా రెవెన్యూ సిబ్బంది విచారించి తేలుస్తారని తెలిపారు. భూ ఆక్రమణకు ఎవరు పాల్పడ్డారనేది నివేదికను అధికారులు అందిస్తారన్నారు. అప్పుడు భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తా



కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలు మాచర్ల నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీలకు స్థానిక పరిపాలనలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన కొమ్ము కౌశల్య పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కౌశల్య మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పీఆర్కే అడుగు జాడల్లో నడుస్తా రు. ప్రభుత్వం యార్డు చైర్మన్‌గా నియమించిన తర్వాత మంగళవారం యార్డు కార్యదర్శి ఉద్యోగులను కలసి మాట్లాడానన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే అనుమతితో మార్చి 6, 7 తేదీలలో మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. తన తండ్రి కొమ్ము చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతున్నారని మా కుటుంబం పార్టీని నమ్ముకున్నందుకు గుర్తించి యార్డు చైర్మన్ పదవికి సిఫారసు చేసినందుకు పీఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, పార్టీ నాయకులు వట్టెపు మరియదాసు, రామావతు జాన్‌పాల్‌నాయక్, కిల్లా కాశి, కాలె రాంబాబు, అన్నపరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించగలరని ఏఈ పేర్కొన్నారు.

మార్చి 25న మెగా బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలోని పట్టణంలో బేతేలు ప్రార్థనా మందిరంలో మార్చి 25వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మెగా బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు మంగళవారం పోటీల నిర్వాహకులు పాస్టర్ బ్రహ్మనాయుడు తెలిపారు. యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించటంతో పాటు క్రైస్తవ విశ్వాసుల్లో బైబిల్ పరిజ్ఞానం పెంచేందుకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అపోస్తుల కార్యములు, ఫిలిప్పి పత్రిక అనే పుస్తకంపై ఈ క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9848343195ను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుర్గి: మూడు రోజుల క్రితం మండలంలోని అడిగొప్పల గ్రామానికి చెందిన వ్యక్తి గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో మృతి చెందినట్లు దుర్గి ఎస్‌ఐ ఎస్.కోటయ్య మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం అడిగొప్పల గ్రామానికి చెందిన కె.కుమారస్వామి (50) అనే వ్యక్తి గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో మూడు రోజుల క్రితం జాయిన్ అయ్యాడని మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అడిగొప్పల గ్రామంలో విచారించినా ఆచూకీ లేదన్నారు. తెల్లచొక్కా, బ్లూ కలర్ లుంగీ ధరించాడన్నారు. మృతుని గుర్తించిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతన్నకు అన్ని సేవలు అక్కడే

ఆరుగాలం శ్రమించే రైతన్న సంక్షేమమే లక్ష్యంగా, అన్నదాతలకు అండగా ఉండాలని, వ్యవసాయాన్ని పండుగ చేయటమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమ రాజ్యమే లక్ష్యంగా విత్తు నుంచి పంట విక్రయాల వరకు అడుగడుగునా వారికి అండగా ఉంటున్నారు. గ్రామ స్థాయిలోనే రైతులకు సకాలంలో సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి సాగులో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. సీఎం జగన్ ఏర్పాటు చేసిన ఆర్‌బీకే వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచి, మన్ననలు పొందింది.

- మండలంలో మొత్తం 17 ఆర్‌బీకేలు ఏర్పాటు
- విత్తు నుంచి విక్రయం వరకు సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



కొత్తపల్లి రైతు భరోసా కేంద్రం



మాచర్ల రూరల్: భూమి తల్లిని నమ్ముకొని వ్యవసాయం చేసే రైతన్నలు గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కావాలంటే సుదీర ప్రాంతాలైన మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సకాలంలో అందక ఇబ్బందులు పడుతుండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత వీరి కష్టాలు గుర్తించి సీఎం జగన్ గ్రామ స్థాయిలోనే వ్యవసాయ అనుబంధాల రంగాలకు సంబంధించిన సేవలన్నింటినీ ఆర్‌బీకేలలో అందిస్తున్నారు. సీఎం దూరదృష్టితో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకేలు) సత్ఫలితాలనిస్తున్నాయి. వ్యవసాయ శాఖకు చెందిన సేవలే కాకుండా ఉద్యాన, ఏపీఎంఐపీ, పశు సంవర్థక, మత్స్య, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందిస్తున్నాయి. దీంతో రైతన్నలకు సమయం, డబ్బు, ఆదా కావటంతో పాటు శ్రమ కూడా తప్పింది. మాచర్ల మండలంలో 17 ఆర్‌బీకేలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిర్మాణాలు పూర్తి చేసుకొని గ్రామాభివృద్ధిలో అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచటం, ఇందుకు అవసరమైన ఇన్‌పుట్స్.. విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకునేలా ఆర్‌బీకేలు రైతులకు అండగా ఉంటున్నాయి. దీంతో పాటు వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించి 50 రకాల పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పాటయ్యాయి. ఘన, ద్రవ, జీవామృతం, కషాయాలపై రైతులకు శిక్షణనిస్తారు. డిజిటల్ కియోస్కుల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఆర్డర్ పెట్టి వారి ఇంటికే తీసుకొచ్చి అందించే ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో పంటల నమోదు చేసి ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, అర్హులైన రైతులకు రైతు భరోసా, కౌలు రైతు కార్డులు, కిసాన్ కార్డులు నమోదు చేస్తున్నారు. ధాన్యం, కందులు, పత్తి వంటివి దళారుల బెడద లేకుండా రైతుల వద్దకు వెళ్లి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతుల సమస్యలను గుర్తించేందుకు గ్రామ సలహా మండలి సమావేశాలు ఏర్పాటు చేసి రైతన్నలకు భరోసా కల్పిస్తున్నారు.



ఆర్‌బీకేలోని కియోస్క్‌లోఎరువులు బుక్ చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి



రాయవరంలో పొలాల్లో రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్న ఏవో లక్ష్మారెడ్డి, సిబ్బంది

రైతు వద్దకే అన్ని రకాల సేవలు..



రైతన్నల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకనుగుణంగా ఎప్పటికప్పుడు సేవలను మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. సబ్సిడీ విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అందజేస్తున్నాం. రైతులు కోరింది అందుబాటులో లేకపోతే తెప్పించి ఇస్తున్నాం. ఈ క్రాప్ బుకింగ్, పంటల నమోదు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఆర్‌బీకేల వారీగా రైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాం.

– జగదీశ్వరరెడ్డి , ఏడీఏ

సమస్యలన్నీ గ్రామంలోనే పరిష్కారం..



గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కావాలన్నా 10కి.మీల దూరంలో ఉన్న మాచర్ల వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి రోజుల తరబడి తిరిగే వాళ్లం. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా మా గ్రామానికి అధికారులు తీసుకొచ్చి ఇస్తున్నారు. దీని వలన సమయం, డబ్బు ఆదా కావటంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. ఆర్‌బీకేలు మాకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నాయి.

– యంద్ర గాలయ్య, రైతు, తాళ్ళపల్లి

గ్రామాలలోనే అందుతున్న వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు పంపిణీ చేస్తున్న మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు



వైద్య శిబిరంలో రోగి సమస్యను తెలుసుకుంటున్న డాక్టర్ రమ్య



జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

కారెంపూడి: చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా గ్రామాలలో వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బొమ్మిన సావిత్రిఅల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ వైద్యంతో పాటు ప్రతి గడపకు మంచి చేసి మీ ఇంట్లో మంచి జరిగిందనిపిస్తేనే ఓటు వేయమని అడుగుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. జెడ్పీటీసీ షేక్ షఫీ, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య మాట్లాడుతూ గతంలో ఎంతో మంది పాలకులను చూశామని ప్రజలకు ఏది కావాలో అది చేసి చూపించిన ఘనత మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ తీరే సీఎంకు ప్రజల పట్ల ఉన్న ప్రేమకు ఉదాహరణగా పేర్కొన్నారు. సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ, ఎంపీటీసీ అనంతరామయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మిఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ రామయ్య, లాజర్ పాల్గొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. శిబిరంలో 446 మందికి వైద్య సేవలందించారు. డాక్టర్ ఎం.రమ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సింధు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అలేఖ్య వైద్య సేవలందించారు. కంటి వైద్య నిపుణులు టి.సిద్ధార్థ, సిబ్బంది 106 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. గత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 45 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్, హెచ్ఎస్ కె.మల్లయ్య, వెంకటమణి, లాలు, అపర్ణ, నాగజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వైద్య శిబిరంలో సేవలందించారు.

పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం

పశర్లపాడు(రెంటచింతల): గ్రామాలలోని ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో సర్పంచ్ షేక్ హసాన్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులను, కళ్లద్దాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతందన్నారు. దీంతో ప్రతి కుటుంబ ఆరోగ్య విషయాలను ఒక యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆ యాప్ సమాచారం ఆధారంగా తదుపరి చికిత్సలు ఎక్కడ చేయించాలన్న దానిపై అవగాహన ఉంటుందన్నారు. యాప్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంట్లో ఎవరికి ఎలాంటి వైద్య సహాయం కావాలో, ఏఏ మందులు అవసరమో ముందుగానే తెలుస్తుందన్నారు. ఈ శిబిరంలో మొత్తం 422 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌లను సర్పంచ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్య, డాక్టర్ సాగరరాణి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చకచకా మహాశివరాత్రి ఏర్పాట్లు



సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో మార్చి 8న జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు. అతిపురాతన శైవక్షేత్రంగా సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానానికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. శివరాత్రి సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు ఇక్కడకు వస్తారన్నారు. భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతీయువకులు వలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలన్నారు. ఆశక్తి కలిగిన వారు నంబర్ 9030803175ను సంప్రదించాలని కోరారు.

మానసిక దివ్యాంగులకు అన్న సంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, సుమలతలు మంగళవారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు ప్రతి ఒక్కరు చేయూతను అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గార్లపాటి ప్రభాకర్, పాఠశాల నిర్వాహకుడు కిషోర్ బాబు, తదితరులు ఉన్నారు.

మోర్జంపాడులో లేగదూడల ప్రదర్శన

మాచవరం: నేటి లేగదూడలే రేపటి పాడి పశువులని, పాడి రైతులు పశుపోషణలో తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని పశు వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లేగ దూడల పశు ప్రదర్శన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ఆరోగ్యమైన, అందమైన దూడలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పాడి పశువుల కొనుగోలుకు రుణసదుపాయం కల్పించిందన్నారు. పాల దిగుబడిని పెంచేందుకు పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, ఎంపీటీసీ ముంగి మంగమ్మ శివరామయ్య, జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, పశువైద్యులు కె.శ్రీనివాసరెడ్డి, వి.రాము, టి.సత్యనారాయణ, చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు బహుమతులు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రకృతి వైపరీత్యాలకు ప్రత్యామ్నాయం ప్రకృతి విధానమే

యడ్లపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటల రక్షణకు ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయమేనని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని ప్రకృతి విధానంతో సాగైన పంటల్ని పరిశీలించారు. సంగం గోపాలపురం సమీపంలో ప్రసన్నాంజనేయ స్వామి గుడి ఎదురుగా సాగు చేస్తున్న రైతు రామకృష్ణ పొలాన్ని సందర్శించి సాగు వివరాలు, ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రకృతి సాగు విధానంపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామకృష్ణ అనే రైతు ఇక్కడ ఎకరం భూమిలో ప్రకృతి సేద్యం చేస్తున్నాడన్నారు. అయితే ఆ భూమిలో 10 సెంట్లలో ప్రత్యేక బెడ్లను వేసి అందులో రకరకాల ఆకుకూరల సాగుకు శ్రీకారం చుట్టాడని తెలిపారు. ఈ సాగుకు రసాయనిక, పురుగు మందుల్ని కాకుండా పూర్తిగా ప్రకృతి విధానంతోనే బీజామృతం, ఘన జీవామృతం వంటి వాటిని వినియోగిస్తు, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి నాణ్యమైన ఉత్పత్తుల్ని సాధిస్తున్నాడని వివరించారు. బెడ్లపై ఒకభాగంలో సాగు చేసిన పంట పూర్తికాగానే తిరిగి అదే భాగంలో పంటమార్పు చేయడంతో దిగుబడి తగ్గే అవకాశం లేదన్నారు. ప్రకృతి విధానంతో సాగు చేసిన పంటలు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇస్తాయన్నారు.

వేసవి నీటి ఎద్దడికి ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పట్టణంలోని 33వ వార్డులోని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరరెడ్డి మాట్లాడుతూ నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మించి ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికోసం తన వంతు శక్తి వంచనలేకుండా పని చేస్తున్నానన్నారు. తన హయాంలో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన సుమారు రూ.10 కోట్ల అప్పులను ఇప్పుడు తీర్చామన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకు రావడంతోనే నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మించడం జరిగిందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.3.5 కోట్లు కరెంట్ బిల్లు బకాయిలను చెల్లించడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో ఉన్న రూ.6 కోట్లు బకాయిలను చెల్లించామన్నారు. ప్రత్యేక నిధులతో పట్టణంలో అనుకున్నంత అభివృద్ధి ఎమ్మెల్యే సహాయ సహకారలతోనే సాధ్యం అయిందన్నారు. రోడ్డు విస్తరణ, వాటర్ స్కీమ్, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, చెరువు అభివృద్ధి, పార్క్ నిర్మాణం వంటి పనులు చేశామన్నారు. తన కాలంలో జరిగిన అభివృద్ధితో సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్ అప్పిరెడ్డిలు పట్టణంలో అనుమతులు లేని లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా వచ్చిన షాపింగ్ మాల్స్ వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని, మాల్స్ వారు పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని కౌన్సిల్ ముందుకు తెచ్చారు. మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కారం దిశగా విధులు నిర్వహిస్తామని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు పట్టణంలో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం ఉందని తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా కుళాయిల వద్ద నీరు వృధా కాకుండా ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. ముందుగా కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యనారాయణ, ఏఈ రాఘవేంద్రరావు, మేనేజర్ శివ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితంగా 100 రోజులు పని కల్పించాలి

ఏపీడీ సురేంద్రకుమార్



పంటకాల్వల్లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సురేంద్రకుమార్, ఏపీవో జయచంద్రకుమార్

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని కూలీలకు పనులు లేని సమయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వారికి క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు చూపించి భరోసా కల్పించాలని ఏపీడీ సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మంచికల్లు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 60 మంది కూలీలతో చేపట్టిన పంట కాల్వతీత పూడిక పనులను, సంబంధిత మస్టర్‌ను ఆయన ఏపీవో జయ చంద్రకుమార్‌తో కలిసి పరిశీలించి ఎఫ్ఏకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు రూ.8 కోట్ల విలువైన 219 పనులను గ్రామాలలో గుర్తించామన్నారు. గ్రామాలలో ప్రస్తుతం ఏర్పడిన మంచినీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో ఉన్న 70 నీటి కుంటలలో పూడిక తీత పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. 10 గ్రామాలలో మొత్తం 556 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు రానున్న రోజులలో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ ద్వారా పంటకాల్వల, చెరువులలో పూడిక తీత , నీటి కుంటల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన చిన్న, సన్నకారు రైతుల భూముల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి కచ్చితంగా 100 రోజుల పనిదినాలను కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనన్నారు. పథకం కింద గ్రామాలలో చేపట్టే పనులకు కచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉండాలన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ వి.విజయకుమారి, ఎఫ్ఏలు తదితరులున్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



మాచర్ల: రాష్ట్రంలో ఎన్నికలకు సిద్ధం సమయంలో సీ ఎం జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న 4వ విడత బాపట్ల జిల్లాలోని మేదరమెట్ల సిద్ధం సభకు లక్షలాది మంది యువజనులు తరలివచ్చి సీఎంకు జే జేలు పలకాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు లక్షల కోట్ల రూపాయల ప్రయోజనం చేకూర్చిన నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. ఇప్పటివరకు జరిగిన సిద్ధం సభలకు లక్షలాది మంది జే జేలు పలికారన్నారు. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు జరిగే మేదరమెట్ల సభను మరింత విజయవంతం చేసేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో యువజన మహానేతగా ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ముందుకెళ్తున్న సీఎం జగన్ సత్తాను మనమందరం చూపించి ఆయనకు మద్దతు పలకటానికి సిద్ధం సభకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా వెంకట్రామయ్య మెమెంటో, ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

మాచర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలకు, ముఖ్యంగా గిరిజన తండాలకు వైద్యమందించటంలో ప్రజా ప్రతినిధిగా విస్తృత సేవలందించిన కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఓరుగుంటి జయప్రకాష్ ఉత్తమ సేవ అవార్డును అందుకున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకుంటున్నట్లు ఎంపీడీవో సరోజినీదేవి తెలిపారు. అలాగే జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శిగా ఉత్తమ ప్రతిభను కనబరచి గ్రామంలో మపారిశుద్ధ్య పరిరక్షణలో విస్తృత సేవలందించిన కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య మెమెంటో, ప్రశంసాపత్రం అందుకుంటున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో విస్తృతమైన సేవలందించి జిల్లాలోనే ప్రముఖంగా నిలిచిన వారికి ఆమె అభినందనలు తెలిపారు.

మార్చి 3న పోలియో చుక్కల కార్యక్రమం

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి

రెంటచింతల: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి నేతృత్వంలో మార్చి 3న సామూహిక పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో నున్న 0–5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ మార్చి 3న ఏర్పాటు చేసే శిబిరంలో వారి తల్లిదండ్రులు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసే శిబిరాలతో పాటు ఓ మొబైల్ టీం ద్వారా కూడా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. దేశం నుంచి పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.